క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో...



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రం, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారిని దర్శించిన సినీ నటుడు సుబ్బరాయశర్మ



శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సుబ్బరాయ శర్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఉప్పలూరి సుబ్బరాయ శర్మ బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. సుబ్బరాయ శర్మ మాతృదేవోభవ, నెంబర్ వన్, శుభలగ్నం, యమలీల, రిక్షావోడు, సిసింద్రీ, ధర్మచక్రం, మావిచిగురు, నాగ, గణేష్, ఇద్దరు మిత్రులు, గంగోత్రీ, మగధీర, రుద్రమదేవి, బాహుబలి వంటి చిత్రాలతో పాటు, పలు సీరియల్స్‌లో నటించారు.

మున్సిపల్ కార్మికులు విధుల్లోకి చేరాలని వినతి



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: సమ్మెను విరమించి విధుల్లోకి చేరాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కోరారు. బుధవారం కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరానికి కౌన్సిల్ సభ్యులతో కలిసి ఆమె వెళ్లి కార్మికులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేతనం రూ.3 వేలు, హెల్త్ అలవెన్సులు రూ.6 వేలు పెంచిందన్నారు. గత ప్రభుత్వం చిరుద్యోగులను ఇబ్బందులు పెట్టిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుందని తెలిపారు. రాబోయేది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని, వచ్చే బడ్జెట్‌లో కార్మికుల జీతాలు, డిమాండ్‌లను పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలు తీవ్రం కాక ముందే కార్మికులు అర్థం చేసుకుని సమ్మెను విరమించి విధుల్లో చేరాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అచ్యుతరామయ్య, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, పార్టీ నాయకులు బత్తిని చిన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి

కొయ్యలగూడెం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కొయ్యలగూడెం టౌన్ పరిధిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు చదలవాడ సుప్రజ, చిలకలపూడి మనోజ్ కుమార్‌లకు వైస్ ఎంపీపీ మట్టా వనజాక్షి, సత్యనారాయణ దంపతులు రూ.6 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. స్వర్గీయ మట్ట వెంకన్న గుర్రమ్మల ట్రస్ట్ తరుపున ఏటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఐ.రాజకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పొలం తగాదాలో ఇరువర్గాలు ఘర్షణ పడి కొట్టుకున్న నేపథ్యంలో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. కేతవరానికి చెందిన నరెడ్ల మధు సత్యవాణి పొలంలో పనిచేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన నరెడ్ల దుర్గారావు, నాగేశ్వరరావు, రాజు, వెంకటేశ్వరరావు ఘర్షణపడి ఆమెను కొట్టారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఇదిలా ఉండగా, నరెడ్ల నాగేశ్వరరావు తన పొలంలో పనిచేసుకుంటుండగా, నరెడ్ల మంగరాజు, మరికొంతమంది వచ్చి తనతో ఘర్షణ పడి కొట్టి గాయపర్చారరని, దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: మహిళ అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కొత్తగూడెంకు చెందిన సుబ్బారావు తన భార్య ఈనెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నూతన సంవత్సర కానుక.. రూ.3 వేల పింఛన్

- ఇచ్చిన మాటకు కట్టుబడి విశ్వసనీయత చాటిన జగన్
- లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు



బుట్టాయగూడెం: నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి



లింగపాలెం: పింఛన్లు పంపిణీ చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా, ఎంపీపీ వెంకటలక్ష్మి

పోలవరం రూరల్: కుల, మత, వర్గ, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. నూతన సంవత్సర కానుకగా పెంచిన ఫించన్ సొమ్ము రూ.3 వేలను బుధవారం పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి లబ్దిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ 3 వేలకు పెంచం జరిగిందన్నారు. వలంటీర్ల్స్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థలేకుండా నేరుగా పథకాలు అందజేయడం, ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకురావడం వైఎస్ జగన్ ఘనతే అని అన్నారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెల్లం రాజ్యలక్ష్మి పోటీ చేస్తున్నారని, ఆమె అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందుకు సాగుతామని అన్నారు. ప్రజలకు, పార్టీనాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు తన కుటుంబం రుణపడి ఉంటుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న సీఎం జగన్

బుట్టాయగూడెం: పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం దేశంలో ఎక్కడాలేని విధంగా వృద్ధాప్య పింఛన్లు రూ.3 వేలకు పెంచి ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పెరిగిన నూతన పింఛన్లను ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో 18 సచివాలయాల పరిధిలో 7118 వృద్ధాప్య పింఛన్లు, కొత్తగా మంజూరైన పింఛన్లు 138 మొత్తం 7256 పింఛన్లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గంజిమాల దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ ఎస్. శారాశాంతి, మండలంలోని ఎంపీటీసీలు సర్పంచ్‌లు, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 66 లక్షల మందికి పింఛన్ల పంపిణీ

చింతలపూడి: రాష్ట్రంలో 66 లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌లను ఈ ఏడాది నుంచి రూ.3 వేలకు పెంచినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరికైనా ఫింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని అన్నారు. గ్రామంలో ఎవరైనా పింఛన్‌దారులు చనిపోతే తప్ప కొత్త వారికి పింఛన్ మంజూరయ్యేది కాదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామన్నారు. సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే పింఛన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 5 గంటలకే వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ అందిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అవ్వ తాతలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో 9,736 మందికి రూ.2,92,52,500, నగర పంచాయతీలో 2,904 మందికి రూ.87,09,000 పింఛన్‌ల రూపంలో అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎస్.వరలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందమే లక్ష్యం

లింగపాలెం: పేదల కళ్లలో ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి లక్ష్యమని, దీనిలో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అవ్వా,తాతలకు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చే సామాజిక పింఛన్లను ఈనెల నుంచి రూ.3 వేలకు పెంచి అందిస్తున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. బుధవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ ప్రజలు గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత జగన్ పాలనకు తేడా గమనించాలని కోరారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి, లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కె రమేష్, డి రవీంద్ర, పి ప్రసాద్, టి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్



ద్వారకాతిరుమల: పింఛన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పింఛన్ల పెంపు ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ముందుగా పెరిగిన పింఛన్ సొమ్మును లబ్దిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లతో కలిపి మొత్తం పింఛన్ల సంఖ్య 10,142కు, నియోజకవర్గంలో వాటి సంఖ్య 44,627 కు చేరిందన్నారు. ఇప్పటి వరకు రూ. 2750 అందుకున్న లబ్ధిదారులు ఈనెల నుంచి రూ. 3 వేలు అందుకుంటున్నారని అన్నారు. నవరత్న పథకాల్లో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుక నగదును ఇచ్చిన మాట ప్రకారం జగనన్న మరోసారి పెంచి, నూతన సంవత్సర కానుకగా లబ్దిదారులకు అందించారన్నారు. దేశంలో రూ. 3 వేల పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని, ఆ ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ సారధికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి రమ్య కుసుమ, అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, తేలు వెంకటేశ్వరరావు, చిలుకూరి సుబ్రహ్మణ్యం, షేక్ భాషా, దాకారపు బంగారమ్మ, మానుకొండ మణి, యంత్రపాటి సునీల్, ఆకుర్తి సత్యన్నారాయణ, మిడతా చందు గౌడ్, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నిరంతర ప్రక్రియ



జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ఎలీజా



చింతలపూడి: సుబ్బరాజు జెడ్పీ హైస్కూల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక చంద్రశేఖర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆరోగ్య విప్లవం సృష్టిస్తున్నారన్నారు. పేదల ఆరోగ్య రక్షణకు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందించడమే కాకుండా, ప్రతి నెలా అవసరమైన మందులు వ్యాధులు నయం అయ్యేంత వరకు ఉచితంగా ప్రభుత్వమే అందజేస్తోందన్నారు. ఇప్పటికే తొలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, జనవరి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆరు నెలల పాటు నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో వారానికి రెండు రోజులు, పట్టణాల్లో ఒక రోజు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, జిల్లా వైద్యవిభాగం కార్యదర్శి కఠారి సీతారాంబాబు, బత్తిన చిన్న, భావన రుషి, జిలానీ, అమీర్, చిప్పాడ వెంకన్న, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, గూడపాటి రాధాకృష్ణ, చనమాల శ్రీనివాస్, హఫీజ్, అక్బర్, వెంప ఐజక్, కాటం డేవిడ్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య రక్ష

చింతలపూడి: ప్రతి కుటుంబానికి ఆరోగ్య రక్ష కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సుబ్బరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహించారు. పేదలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకువచ్చారని పేద, మధ్య తరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్లు నరేష్, అనిల్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య సురక్ష కార్డులు అందచేశారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, డి పేర్రాజు, జి సురేష్, సచివాలయ కార్యదర్శి రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి కృషి మరువలేనిది



జంగారెడ్డిగూడెంలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



చింతలపూడిలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బడుగు బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతికి చేసిన సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా కొనియాడారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి పురస్కరించుకుని ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎలీజా మాట్లాడుతూ స్త్రీల పట్ల వివక్ష ఉన్న ఆనాడే ఎంతో ధైర్యంగా మహిళా విద్య కోసం జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదని అన్నారు. బాలికల విద్య కోసం సావిత్రిబాయి పూలే పూణేలో పాఠశాలను నెలకొల్పి సంస్కరణకు బీజం వేశారన్నారు. బాలికలకు, మహిళలకు విద్య అనవసరం అని పోరాడి సంఘ బహిష్కరణను సైతం లెక్కచేయలేదన్నారు. అటువంటి ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, జిల్లా వైద్యవిభాగం కార్యదర్శి కఠారి సీతారాంబాబు, బత్తిన చిన్న, భావన రుషి, జిలానీ, అమీర్, చిప్పాడ వెంకన్న, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, గూడపాటి రాధాకృష్ణ, చనమాల శ్రీనివాస్, హఫీజ్, అక్బర్, వెంప ఐజక్, కాటం డేవిడ్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని ఆరుగురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు జె.చెంచులక్ష్మి, ఎం.ప్రసన్నరాణి, బి.వసంత్‌కుమార్, అరుణకుమారి, టి.కరుణశ్రీ, వై.తిరుపతమ్మలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో, సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

చింతలపూడి: సావిత్రిబాయి పూలే 192వ జయంతిని చింతలపూడిలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పలువురు బీసీ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు పూలవూలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కుల వివక్ష, అంటరాని తనం, బాల్య వివాహాలు, మహిళా సాధికారతకు ఎన లేని కృషి చేశారని మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కోడూరి శ్రీనివాసరావు, ఆర్నేపల్లి అప్పారావు, బీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీమరాజు మాట్లాడుతూ భారతదేశంలో స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళ, సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయినిగా, రచయిత్రిగా సమాజంలోని నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.

కుక్కునూరు: చదువుల తల్లి, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు నిమ్న వర్గాల అభ్యున్నతికి భర్తతో కలిసి తనవంతు పాత్ర పోషించిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళా లోకానికి ఆదర్శమని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పేర్కొన్నారు. బుధవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని కుక్కునూరులో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకి వెంకటమ్మ, నక్క రమణ, బోళ్ల రాజేశ్వరి, చిలకమ్మ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ ఏజెంట్‌పై ఫోర్జరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇన్సూరెన్స్ ఏజెంట్‌పై ఫోర్జరీ కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. పట్టణానికి చెందిన మద్దాల నాగరాజు తన టాటా ఏస్ వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కోసం ఒరిజినల్ పత్రాలతో రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ శివప్రసాద్ ఆ పత్రాలను పరిశీలించగా అందులో ఇన్సూరెన్స్ పత్రం నకిలీ పత్రం ఉన్నట్లు గుర్తించారు. దీనిపై వాహన యజమానిని ప్రశ్నించగా, తాను ఎస్.కుమార్ అనే ఏలూరుకు చెందిన ఇన్సూరెన్స్ ఏజెంట్‌కు రూ.14 వేలు చెల్లించి ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. దీంతో వాహన యజమానిని, ప్రభుత్వాన్ని మోసం చేసిన ఇన్సూరెన్స్ ఏజెంట్ ఎస్.కుమార్‌పై ఎంవీఐ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.